నత్తే నయం..!

ముందుకు సాగని టీటీడీ కూడలి ఆధునికీకరణ

- ఏడాదిగా సాగదీస్తున్న కాంట్రాక్టర్
- పనులపై శ్రద్ధ చూపని జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు
- కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తున్నారంటూ సర్వత్రా ఆరోపణలు


ప్రస్తుతం పనులు చేస్తున్న కూలీలు


టీటీడీ కూడలిలో నిలిచిపోయిన ఆధునికీకరణ పనులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులు రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం (ప్రాజెక్ట్స్) ఈ కూడలి ఆధునికీకరణ పనులు దాదాపు ఏడాది క్రితం ప్రారంభించింది. నగర వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్‌లో భాగంగా టీటీడీ కూడలిని సైతం ఆధునికీకరిస్తున్నారు. అయితే గత ఏడాది కాలంగా ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది కాలంలో మూడు సార్లు పనులు నిలిచిపోగా తాజాగా ఇటీవల మరోసారి ప్రారంభించారు. పనుల నిర్వహణలో జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈసారైనా పనులు పూర్తిచేసి సర్వాంగ సుందరంగా కూడలిని అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.


కూడలి ఆధునికీకరణ డిజైన్

ఏడాదవుతున్నా తొలిదశలోనే...

రూ.1.07 కోట్ల వ్యయంతో ఈ కూడలి ఆధునికీకరణ పనులను ఏడాది క్రితం అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టింది. సర్కిల్ బ్యూటిఫికేషన్, గ్రీనరీ అభివృద్ధి, ఫౌంటెయిన్ల నిర్మాణం, స్టోన్ వర్క్, మధ్యలో శ్రీవేంకటేశ్వరస్వామి శంకుచక్రనామాల ఏర్పాటు పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఇందుకు అనుగుణంగా కూడలి లోపల కొత్త మట్టిని వేయడం, ఫౌంటెయిన్ నిర్మాణం కోసం వృత్తాకారంలో గోడలు కట్టడం, వాటి మధ్యలో పిల్లర్స్ నిర్మాణం మినహా ఇతర పనులు జరగలేదు. ఇప్పటికే మూడుసార్లు పనులు నిలిచిపోవడంతో ఆధునికీకరణ ఇంకా తొలిదశలోనే ఉందని స్థానికులు నిట్టూర్చుతున్నారు.

కాంట్రాక్ట్ సంస్థపై సర్వత్రా విమర్శలు

నిర్మాణ పనుల్లో తరచూ అంతరాయం ఏర్పడటంతో పనులు ఇంకెన్నాళ్లు సాగదీస్తారంటూ స్థానికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనుల పూర్తిపై అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్ సంస్థతోపాటు జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు గతంలో ఏఎస్ రాజా కూడలిని ఇదే సంస్థ అభివృద్ధి చేసింది. అయితే ఆ కూడలిలో పనుల నాణ్యతపై పెద్ద ఎత్తున విమర్శలు తలెత్తాయి. ఫౌంటెయిన్ కనీస ఆకర్షణగా లేకపోవడం, మోటార్స్ అప్పుడే శిథిలం కావడంతో కొద్దికాలంలోనే ఆ కూడలి ఆకర్షణ కోల్పోయింది. అయినా టీటీడీ కూడలి అభివృద్ధి పనులను సైతం జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం మరలా అదే సంస్థకు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. ఈ కూడలి ఆధునికీకరణలో అయినా కనీస నాణ్యత పాటిస్తారా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతోపాటు పనుల నిర్వహణలో కాంట్రాక్టర్ చూపుతున్న నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడడంతోపాటు త్వరగా పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆచార్యులు అత్యుత్తమంగా బోధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రతి విభాగంలో తరగతులు పటిష్టంగా నిర్వహించాలని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఆయన వర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాల పరిధిలోని సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల నిర్వహణను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. విభాగాధిపతులు, విద్యార్థులతో మాట్లాడారు. తరగతులు జరుగుతున్న విధానం తెలుసుకున్నారు. విభాగాల్లో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని విద్యార్థులకు స్పష్టం చేశారు. ఆచార్యులు, గెస్ట్ ఫ్యాకల్టీలు అంతా షెడ్యూల్ మేరకు తరగతులకు హాజరై, పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన ప్రమాణాలను అత్యుత్తమంగా నిలపడంతోపాటు నిరంతరం మెరుగుపరిచే దిశగా ఆచార్యులు కృషి చేయాలని సూచించారు.

కార్పొరేట్ విద్యా వ్యవస్థను నిరోధించండి

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్పొరేట్ విద్య వ్యవస్థను నిరోధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవింద రావు న్యూఢిల్లీలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీలో విద్య హక్కు చట్టం - 2009ని పూర్తి స్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెనుకబడిన ఉత్తరాంధ్రలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ నియామకం జరగలేదని, సత్వరమే నియమించేందుకు చొరవ చూపాలని కోరారు.

క్రీడాకారిణికి అభినందన


యామినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ వీఎంసీ కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న కరాటే క్రీడాకారిణి ఎ.యామినీ వెంకటదుర్గను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు అభినందించారు. ఇటీవల నగరంలోని పోర్టు స్టేడియం వేదికగా జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఆమెకు అభినందనలు తెలిపారు. ఆ పోటీలలో యామిని 45 కేజీల విభాగంలో పాల్గొని, తుదిపోరులో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను సొంతం చేసుకుంది. గురువారం ఆయా మెడల్స్, సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్‌ను మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన అభినందనలు తెలిపారు.

ఇంత అధ్వానమా..!


కోస్టల్ బ్యాటరీ వద్ద డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాల కుప్ప

ఏయూక్యాంపస్: నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటోంది. దీనికి నిదర్శనమే ఈ చిత్రం. కోస్టల్ బ్యాటరీ సమీపంలో డ్రైనేజీ నుంచి తొలగించిన చెత్త కుప్ప కంపు కొడుతోంది. మురుగునీరు సైతం రోడ్డుపైకి చేరి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అటువైపుగా వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లవలసి వస్తోంది. కాలువల్లో, డ్రైనేజీలలో భారీగా పేరుకుపోతున్న వ్యర్థాల్లో అధిక శాతం ప్లాస్టిక్ సీసాలే దర్శనమిస్తున్నాయి. విచక్షణారహితంగా ప్లాస్టిక్ వినియోగానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వినియోగించిన ప్లాస్టిక్‌ను సక్రమంగా రీసైకిల్ చేయాల్సిన అవసరం ఉంది.

జూలో ఎలుగుబంటి ఎన్‌క్లోజర్ పునర్నిర్మాణం


జూలో నిర్మిస్తున్న ఎలుగు బంటి ఎన్‌క్లోజరు

ఆరిలోవ : ఇందిరా గాంధీ జూ పార్కులో ఎలుగు బంట్ల ఎన్‌క్లోజర్‌ను అధికారులు పునర్నిర్మిస్తున్నారు. ఇందుకోసం కొద్ది రోజులుగా పనులు జరుపుతున్నారు. జూలో ఎలుగుబంటి ఎన్‌క్లోజర్లు మూడు ఉన్నాయి. వాటిలో సింహాల ఎన్‌క్లోజరు పక్కన ఉన్న ఎన్‌క్లోజరు సుమారు పదేళ్ల క్రితం శిథిలావస్థకు చేరింది. ఇందులో డేక్రాల్‌తోపాటు నైట్ క్రాల్ కూడా శిథిలమయ్యాయి. దీంతో జూ అధికారులు అందులోని ఎలుగుబంట్లను వేరే ఎన్‌క్లోజరులోకి తరలించి దాన్ని ఖాళీ చేయించారు. సుమారు పదేళ్లుగా ఖాళీగా ఉండటంతో మొక్కలు దట్టంగా పెరిగిపోయి అస్తవ్యస్తంగా మారింది. ఇప్పుడు మళ్లీ దానికి మోక్షం కలిగింది. అధికారులు ఆ ఎన్‌క్లోజరును పునర్నిర్మించి వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి చారించారు. ఇందులో భాగంగా నిర్మాణ పనులు కొద్ది రోజులుగా జరుపుతున్నారు. దీని నిర్మాణం పూర్తయితే ఇందులో మళ్లీ ఎలుగుబంట్లు సందర్శకులను అలరించనున్నాయి.

శ్రీవారికి వైభవంగా పుష్పార్చన


పుష్పాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన వేడుకల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యాగశాలార్చన, నిత్య పూర్ణాహుతి, పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పరిమళభరిత పుష్పాలతో అర్చకులు, భక్తులు, కమిటీ ప్రతినిధులు ఆలయం చుట్టూ ప్రదర్శన చేశారు. అనంతరం ఆయా పుష్పాలతో స్వామి వారిని అలంకరించి పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్ పేపర్‌లో మురీమిక్చర్ విక్రయం హానికరం


06విఎస్‌సి85ఏ : వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఆహార భద్రత అధికారులు

ఏయూక్యాంపస్: ప్రింటింగ్ న్యూస్‌పేపర్‌ను ఆహార పదార్థాల విక్రయానికి వినియోగించరాదని జీవీఎంసీ ఆహార భద్రత అధికారులు సూచించారు. ఆహార నాణ్యత, భద్రతపై బీచ్ రోడ్డులో చిరు వ్యాపారులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి.ఎ.బి నందాజీ మాట్లాడారు. మురీ మిక్చర్ అమ్మే వ్యాపారులు న్యూస్‌పేపర్‌లో పెట్టి అమ్మడం వలన వినియోగదారులకు క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిని పూర్తిగా నిలిపివేయాలని, ఎఫ్ఎస్ఐ నిర్ధారించిన పేపర్ ప్లేట్స్ మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఎక్కువ సమయం నిల్వ ఉంచిన పదార్థాలను విక్రయించరాదని, తాజాగా ఉండే ఆహారాన్ని మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. వినియోగదారులతో గౌరవంగా ప్రవర్తిస్తూ, నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఆహార అధికారి జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి సంతాపం


సంతాపం తెలుపుతున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

విశాఖ విద్య: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బంగ్లాదేశ్ విద్యార్థిని శేసోటి నాగ్ కుటుంబ సభ్యులను ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు పరామర్శించారు. గురువారం ఏయూకు వచ్చిన విద్యార్థి తల్లిదండ్రులను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం విద్యార్థిని చిత్రపటానికి అంజలి ఘటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిభవంతురాలైన విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో కోల్పోవడం తమకు ఆవేదన కలిగించిందన్నారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య ఎన్.ఎం.యుగంధర్, ఆచార్య రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

అరకు-కొత్తవలస లైన్‌ను విశాఖలో కొనసాగించాలి


డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంవీపీకాలనీ: అరకు, కొత్తవలస రైల్వే లైన్‌ను విశాఖ డివిజన్‌లో కొనసాగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు కోరారు. ఈ మేరకు డీఆర్ఎం మనోజ్ సాహుకు పార్టీ నాయకులతో కలసి వినతిపత్రం అందించారు. వాల్తేర్ డివిజన్‌ను విశాఖపట్నం డివిజన్‌గా మారుస్తూ, ఇటీవల బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ డీఆర్ఎంను సత్కరించారు. అనంతరం విశాఖ రైల్వే డివిజన్ ఆదాయంలో కీలకమైన అరకు, కొత్తవలస లైన్‌ను ఈ డివిజన్‌లోనే కొనసాగించాలని కోరారు. ఈ మేరకు సానుకూల నిర్ణయానికి కృషి చేయాలని డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల మనోభావాలు దెబ్బతినేలా 'తండేల్' చిత్రం


మీడియాతో మాట్లాడుతున్న జానకిరామ్

సీతమ్మధార: ఉత్తరాంధ్ర మత్స్యకారుల జీవితాలను కథాంశంగా తీసుకుని నిర్మించిన 'తండేల్' సినిమా యథార్థ ఘటనలు వక్రీకరించి తీశారని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాసుపల్లి జానకి రామ్ అన్నారు. ఈ మేరకు గురువారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ చిత్రం మత్స్యకారుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. కాబట్టి ఈ నెల 7న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్రం చూసి మరల ఏం చేయాలనే ఉద్దేశంతో మీడియా ముందుకు వస్తామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుల యథార్థ కథతో సినిమా తీస్తున్నాం అని ఎంతో గొప్పగా ప్రకటనలు చేస్తూ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రం నిర్మించారన్నారు. పాకిస్తాన్‌లో చిక్కుకున్న వారిని విడుదల చేయించడంలో కృషి చేసిన వారిని ఈ సినిమాలో పూర్తిగా విస్మరించారని విచారం వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌లో చిక్కుకున్న శ్రీకాకుళం మత్స్యకారులను విడుదల చేయించే క్రమంలో తాము ఢిల్లీలోని పాకిస్తాన్ రాయబార కార్యాలయానికి పదే పదే తిరిగామని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కూడా కలిసి సమస్య వివరించామన్నారు. ఆయన చొరవతోనే సమస్య పరిష్కారం అయిందన్నారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు చిత్రానికి నిరసనగా ప్లకార్డులు ప్రదర్శించారు. బడే ఎల్లాజీ, కారి గురువులు, సురపతి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఏ బాబు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ ఎస్ఏ బాబు పాల్గొని విద్యార్థినులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ షిప్ వంటి విషయాలపై పట్టు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ కో ఆర్డినేటర్ జె. సునీత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, అధిక సంఖ్యలో విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలిలో అక్రమంగా బడ్డీల ఏర్పాటు

టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఆక్రమణలు


పెదగదిలి గెడ్డ అంచున టీడీపీ నాయకులు ఏర్పాటు చేయించిన బడ్డీలు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో టీడీపీ నాయకుల ఆక్రమణల పర్వం పెరిగిపోతోంది. రోజూ ఏదో ఒకచోట అక్రమాలకు పాల్పడుతున్నారు. జీవీఎంసీ 9 నుంచి 13వ వార్డు వరకు నిత్యం కొందరు టీడీపీ నాయకులు ఫుట్‌పాత్‌లపై అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేయించడం, వాటికి అద్దెలు వసూలు చేయడం, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి షెడ్లు నిర్మించడం, అనధికారిక నిర్మాణాలు చేపట్టడంలో తలమునకలవుతున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 12వ వార్డు పరిధి పెదగదిలి గెడ్డ అంచున గురువారం తెల్లవారేసరికి రెండు బడ్డీలు పుట్టుకొచ్చాయి. స్థానిక వార్డు టీడీపీ నాయకులు కొందరు పేదల పేరుతో ఆ బడ్డీలు ఏర్పాటు చేయించినట్లు సమాచారం. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబును మభ్యపెట్టడానికి... ఆయన వద్ద మెప్పు పొందడానికి ఆ బడ్డీలకు టీడీపీకి చెందిన పసుపు రంగు వేసేశారు. ఆ రంగు వేయడంతో బడ్డీలు అక్రమంగా ఏర్పాటు చేసిన వారు టీడీపీకి చెందిన వారని ఎమ్మెల్యేని నమ్మించడానికి ఈ ప్రయత్నం చేసినట్లు స్థానికులు అంటున్నారు. పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే మధ్యలో గెడ్డపై ఇరుకు బ్రిడ్జి శిథిలం కావడంతోపాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. దాని స్థానంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ అధికారులు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచనలతో రూ 3.75 కోట్లతో విశాలమైన బ్రిడ్జి కొత్తగా నిర్మించారు. దానివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. ఇప్పుడు స్థానిక టీడీపీ నాయకులు మాత్రం విస్తరించిన బ్రిడ్జిపై గెడ్డ అంచున అక్రమంగా బడ్డీలు పెట్టిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ బ్రిడ్జికి ఇరుపక్కలా మరికొన్ని బడ్డీల ఏర్పాటుకు టీడీపీ నాయకులు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన బడ్డీలను పశుసంవర్ధక శాఖ అధికారులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. అయినప్పటికీ మళ్లీ అక్రమంగా బడ్డీలు వెలుస్తుండటంపై ఆయా శాఖల అధికారులపై స్థానికుల నుంచి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

15 వరకు ఇంటింటికీ పశువైద్య సేవలు


డాక్టర్ రామకృష్ణ

ఆరిలోవ : జిల్లా పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 వరకు ఇంటింటికీ పశు వైద్య సేవలు అందించనున్నారు. గత నెల 20 నుంచి 31 వరకు జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిబిరాలలో వైద్య సేవలు అందించగా జిల్లాలో మిగిలిన పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలకు నాలుగు రోజులుగా ఇంటింటికీ వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 15 వరకు ఈ సేవలు అందించి 100 శాతం పశువులకు వైద్యం అందించడం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఉచిత వైద్య శిబిరాలతో జిల్లాలో 60 శాతం పశువులకు సేవలు అందించామన్నారు. 12,222 ఆవులు, గేదెలకు, 9,625 గొర్రెలు, మేకలకు, 16,052 కోళ్లకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. 37,145 గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ మందులు వేసినట్లు వివరించారు. ఇంకా మరో 40 శాతం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు మిగిలిపోయినట్లు తెలిపారు. ఆయా రైతులు గత నెలలో నిర్వహించిన వైద్య శిబిరాలకు అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు పశు వైద్య సిబ్బంది నాలుగు రోజులుగా గ్రామాల్లో వాళ్ల ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పెద్ద పశువులు, దూడలకు నట్టల నివారణ టీకాలు, మేకలు, గొర్రెలకు పాక్స్ టీకాలు, కోళ్లకు కునుకుడు వ్యాధి రాకుండా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15కి జిల్లాలో 100 శాతం పశువులకు ఉచిత వైద్యం అందించడం పూర్తి చేస్తామన్నారు. రోజూ రైతుల వివరాలు, ఎన్ని పశువులకు వైద్య సేవలు అందించామో భారత్ పశుధన్ యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. రైతులు గ్రామాల్లో ఇళ్లకు వస్తున్న పశు వైద్య సిబ్బందికి సహకరించి సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యువకుడి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీకృష్ణ బాయ్స్ హాస్టల్ (పీజీ)లో బుధవారం రాత్రి వెలిగండ్ల కార్తీక్ రాజు (22) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా బద్వేల్ మండలంలోని వెంకటసెట్టిపల్లి దరి రాజుపాలెంకు చెందిన కార్తీక్ రాజు గతంలో విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కోర్సు పూర్తి చేశాడు. అనంతరం విశాఖలోని ఓ కంపెనీలో జాబ్ కోసం ఇంటర్వ్యూకి కూడా వెళ్లాడు. అనంతరం తిరిగి ఊరు వెళ్లిపోయాడు. ఇటీవల ఉద్యోగంలో చేరమని ఫోన్ రావడంతో నగరంలోని మైక్రోగ్రిడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జనవరి 31న చేరాడు. ప్రస్తుతం ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లోని శ్రీకృష్ణ బాయ్స్ హాస్టల్ (పీజీ)లో ఉంటూ ఉద్యోగానికి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి రూమ్‌లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి రూమ్ సభ్యులు కిటికీలో నుంచి చూసి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని పోలీసులు తెలిపారు.

భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ..



ద్విచక్రవాహన చోదకులు శిరస్త్రాణం ధరించడం తప్పనిసరి. రోడ్డు ప్రమాదాలు జరిగినా, సురక్షితంగా బయటపడాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే, ప్రజలు కొన్ని సందర్భాలలో పోలీసుల మాటలు పెడచెవిన పెట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తన హెల్మెట్‌ను చిన్నారికి పెట్టారు. చిన్నారి భద్రతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆయన తన భద్రతను మాత్రం గాలికి వదిలేశారు. ద్విచక్ర వాహన చోదకులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరం ఉంది. ప్రతీ వ్యక్తి వెనుక, ఒక కుటుంబం ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని గుర్తించి, జాగ్రత్తలు పాటించాలి.

– ఏయూక్యాంపస్

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన


పార్కును సందర్శించిన విద్యార్థులు

బీచ్‌రోడ్డు: నగరంలోని శీలానగర్‌కు చెందిన ఓ స్కూల్ విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను గురువారం సందర్శించారు. పార్కులోని వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి విద్యార్థులకు వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం తదితర అంశాల గురించి తెలియజేశారు.